

ఏటీసీ సెంటర్ మంజూరు

జడ్చర్ల నియోజకవర్గంలో రూ.45.15 కోట్లతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) ఏర్పాటు కానుంది.

-8లో ▸



ఎస్‌జీఎఫ్ సందడి..

విద్యార్థులను ప్రోత్సహించేందుకు చేపట్టిన ఎస్‌జీఎఫ్ మండల స్థాయి పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి.

-8లో ▸

గరిష్టం/కనిష్టం 32.7 /22.8

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

అద్భుతం.. ఆ కట్టడాలు

- 'ఇంజినీర్' నైపుణ్యతకు నిదర్శనంగా నిలుస్తున్న రెండు ప్రాజెక్టులు
- ఆసియా ఖండంలోనే మొదటిగా పేరుగాంచిన ఆటోమేటిక్ సైఫన్ సిస్టం
- అప్పట్లోనే సాంకేతికతను పరిచయం చేసిన వనపర్తి సంస్థానాధీశులు
- అతి తక్కువ వ్యయంతో కోయిల్‌సాగర్ నిర్మాణం
- ఉమ్మడి పాలమూరుకు తలమానికంగా నిలిచిన జలాశయాలు

పేరుకే వెనకబడిన ప్రాంతం.. వలసల జిల్లా. కానీ, వనరులను సద్వినియోగం చేసుకోవడంలో.. అత్యున్నత ప్రమాణాలు పాటించడంలో.. సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో.. నైపుణ్యాలను చాటడంలో పాలమూరు ఏనాడు వెనకబాటుకు గురికాలేదు.. అనడానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి ఉమ్మడి జిల్లాలోని సరళాసాగర్, కోయిల్‌సాగర్ జలాశయాలు. అతి తక్కువ వ్యయంతో.. ఊహకందని సాంకేతికతతో నిర్మితమైన ఈ ప్రాజెక్టులు ఉమ్మడి పాలమూరువాసుల సాగు, తాగునీటి కష్టాలు తీరుస్తూ తరిస్తున్నాయి. సోమవారం ఇంజినీర్స్ డే సందర్భంగా ఆయా ప్రాజెక్టుల నిర్మాణం, ఇతరత్రా వివరాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

- వనపర్తి/ దేవరకద్ర

సరళమైన కోయిల్‌సాగర్



సరళాసాగర్ సైఫన్లు తెరుచుకుని దిగువకు పారుతున్న నీరు (ఫైల్)

వనపర్తి సంస్థానాధీశుల కాలంలో ఏడున్నర దశాబ్దాల క్రితం అమెరికాలోని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన ప్రాజెక్టు సరళాసాగర్. మదనాపురం మండలం శంకరమ్మపేట సమీపంలోని దీన్ని నిర్మించారు. దేశ స్వాతంత్ర్యానికి ముందే ఇక్కడ ప్రాజెక్టు నిర్మించాలనే ఆలోచన అప్పటి వనపర్తి సంస్థానాధీశులు రాజారామేశ్వర్‌రావుకు వచ్చింది. తన తల్లి సరళాదేవి పేరుపై ఏదైనా ప్రత్యేకతతో దీన్ని నిర్మించాలనే ఆలోచనతో ఆయన అమెరికాలోని కాలిఫోర్నియాలో ఆటోమేటిక్ సైఫన్ సిస్టం అనే టెక్నాలజీని ఇక్కడికి తీసుకొచ్చారు. అనధికారికంగా 1947 జూలై 10న ఈ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసినా.. స్వాతంత్ర్యం అనంతరం అప్పటి మిలటరీ గవర్నర్ జేఎన్ చౌదరి 1949 సెప్టెంబర్ 15న తిరిగి శంకుస్థాపన చేశారు. పదేళ్లపాటు ప్రాజెక్టు నిర్మాణం కొనసాగింది. అప్పట్లో రూ.35 లక్షలతో పూర్తి చేసిన ఈ ప్రాజెక్టును 1959 జూలై 26న అప్పటి పీడబ్ల్యూడీ మంత్రి జేవీ రంగారావు ప్రారంభించారు. వర్షం నీరు ఊకచెట్టువాగులో నుంచి వృథాగా కృష్ణానదిలో కలిసిపోవడం, ఈ వాగు సమీపంలోని గ్రామాలను తరుచూ వరద ముంపునకు గురికావడంతో ఈ సమస్యను పరిష్కరించేందుకు సరళాసాగర్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. వనపర్తి సంస్థానం ఆధీనంలోని పది గ్రామాల్లోని సుమారు 4,182 ఎకరాలకు సాగునీరందించేలా 0.5 టీఎంసీ సామర్థ్యంతో సరళాసాగర్ ప్రాజెక్టు నిర్మించారు.

ఆసియాలోనే మొదటిది..


ఆటోమేటిక్ సైఫన్ సిస్టం అంటే.. ప్రాజెక్టులోని నీరు పూర్తిస్థాయి మట్టానికి చేరుకోగానే సైఫన్లు వాటంతట అవే తెరుచుకుంటాయి. అప్పట్లో ఈ టెక్నాలజీతో నిర్మించిన ఆసియాలోనే మొదటి ప్రాజెక్టుకు కాగా.. ప్రపంచంలో రెండోది. 17 వుడ్ సైఫన్లు, 4 ప్రీమింగ్ సైఫన్లతో 391 అడుగుల వెడల్పుతో మెయిన్ సైఫన్ నిర్మించారు. ఒక్కో సైఫన్ 520 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుంది. మట్టికట్ట పొడవు 3,537 అడుగులు, రాతికట్ట పొడవు 520 అడుగులు, కట్ట గరిష్ట ఎత్తు 45.2 అడుగులు, నీటి విస్తరణ ప్రదేశం రెండు చదరపు మైళ్లు, కుడికాల్వ 8 కి.మీ., ఎడమ కాల్వ 20 కి.మీ.,లు ప్రవహిస్తూ ఆయకట్టుకు నీరందిస్తున్నాయి. అయితే ప్రాజెక్టుకు అనుసంధానంగా నిర్మించిన కట్ట ఇప్పటి రెండుసార్లు తెగిపోయింది. 1964లో మొదటిసారి, 2019 డిసెంబర్ 31న రెండోసారి కట్టకు గండిపడింది.



సరళాసాగర్ ప్రాజెక్టు నిర్మించేందుకు అమెరికా వెళ్లి టెక్నాలజీని తీసుకువచ్చిన ప్రాజెక్టు రూపకర్త ఎస్ఈ పీఎస్ రామకృష్ణరాజు (ఫైల్)

పాలమూరు జిల్లా వరప్రదాయిని కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ప్రారంభమై నేటికి 71 ఏళ్లు పూర్తయింది. 1947లో తెలంగాణ ప్రాంతానికి ఇంకా స్వాతంత్ర్య రాక ముందు ఆనాటి నైజాం ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేశారు. 1.20 టీఎంసీల సామర్థ్యంతో 26.6 అడుగుల ఎత్తు అలుగు ఉండే విధంగా ప్రాజెక్టుకు అప్పటి ఇంజినీర్లు రూపకల్పన చేసి నిర్మాణ పనులు ప్రారంభించి 1954లో పూర్తిచేశారు. కేవలం రూ.84 లక్షల వ్యయంతో ఈ ప్రాజెక్టు నిర్మాణం పనులు పూర్తయ్యాయి. ప్రాజెక్టు నుంచి మొదటిసారి 9 వేల ఎకరాలకు సాగునీరు అందించారు. 1984లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.91 లక్ష వ్యయంతో 6 అడుగుల మేర కట్టను బలోపేతం చేసి ఎత్తును పెంచి అలుగుపై 13 గేట్లు నిర్మించారు. ఆనాటి ఎమ్మెల్యే వీరారెడ్డి కృషి ఫలితంగానే గేట్ల నిర్మాణం జరిగింది. దీంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా.. 2.27 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉంది. ఆయకట్టు కుడి కాలువ కింద 9 వేల ఎకరాలు, ఎడమ కాల్వ కింద 3 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన జలయజ్ఞంలో భాగంగా రూ.359 కోట్ల అంచనాతో కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకానికి 2006లో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ప్రాజెక్టు ఆయకట్టును 50,250 ఎకరాలకు పెంచుతూ జూరాల నుంచి కృష్ణా జలాలను కోయిల్‌సాగర్‌కు తరలించేలా రూపకల్పన చేశారు.

కోయిల్‌సాగర్ @ రూ.84 లక్షలు



కోయిల్‌సాగర్ ప్రాజెక్టు గేట్ల నుంచి పరుగులు పెడుతున్న నీరు (ఫైల్)

చెక్కు చెదరని నిర్మాణం

నైజాం ప్రభుత్వ హయాంలో 1947– 54 మధ్య నిర్మించిన కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నేటికీ చెక్కు చెదరలేదు. కోయిలకొండ కోట సమీపంలో ఉండడం వల్ల ప్రాజెక్టుకు కోయిల్‌సాగర్ అని పేరు పెట్టారు. రెండు గుట్టల మధ్య ప్రాజెక్టును పటిష్టంగా సున్నం, గచ్చు ఉపయోగించి నిర్మించారు. కట్టకు రెండు వైపులా రాతి గోడ నిర్మించి.. బయటి నుంచి మట్టితో నింపారు. ఇక అలుగును సైతం సున్నం గచ్చు ఉపయోగించి నిర్మించారు. ఆనాడు ఉపయోగించిన పరికరాలు నేటికీ ప్రాజెక్టు సమీపంలోనే పడి ఉన్నాయి. ఇక ప్రాజెక్టు నమూనాను ముందుగా తయారు చేసి నిర్మాణం తర్వాత ప్రారంభించారు. ఆనాడు చేసిన నమూనా నేటికి ప్రాజెక్టు సమీపంలోనే కనిపిస్తుంది. ప్రాజెక్టును 10 జూలై 1954లో అప్పటి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి కేఎం ఖార్జు ప్రారంభించి ఆయకట్టుకు నీటిని వదిలారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల చిన్నబొల్లారం, పెద్ద బొల్లారంతో పాటు మరో రెండు చిన్న గ్రామాలు ముంపునకు గురయ్యాయి. అయితే బాధితులకు ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో ఇళ్లను నిర్మించుకోవడంతో కొత్తగా బొల్లారం పేరుతో గ్రామం ఏర్పడింది.

ఏకైక ప్రాజెక్టు..


ఉమ్మడి పాలమూరు విభజన తర్వాత మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న ఏకైక ప్రాజెక్టు కోయిల్‌సాగర్. గతంలో చిన్న నీటి తరహా ప్రాజెక్టుగా ఉండగా ఎత్తిపోతల పథకం ప్రారంభం తర్వాత భారీ నీటి పారుదల శాఖ కిందకు మార్చారు. సాగునీటితోపాటు పాలమూరు పట్టణానికి తాగునీటిని అందించే విధంగా ఏర్పాట్లు చేశారు. అలాగే నారాయణపేట జిల్లా, కొడంగల్ ప్రాంతానికి తాగునీటి వనరుగా ఉపయోగిస్తున్నారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కింద దేవరకద్ర నియోజకవర్గంలోని దేవరకద్ర, చిన్నచింతకుంట మండలాలు ఉండగా.. నారాయణపేట నియోజకవర్గంలోని మరికల్, ధన్వాడ మండలాలకు సాగునీరు అందిస్తున్నారు. మక్తల్ నియోజకవర్గంలోని నర్వ, అమరచింత మండలాల పరిధిలోని కొన్ని గ్రామాలకు సాగునీరు అందుతుంది. అలాగే ప్రాజెక్టు కాల్వ ద్వారా గొలుసు కట్టు చెరువులను నింపుతున్నారు.



కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పనులకు 1947లో శంకుస్థాపన చేస్తున్న ఆనాటి నైజాం అధికారులు (ఫైల్)



కొనసాగుతున్న ప్రాజెక్టు నిర్మాణం పనులు (ఫైల్)



కట్టను నిర్మిస్తున్న ఆనాటి కూలీలు (ఫైల్)

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌లో 2,597 కేసులు రాజీ

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కోర్టులో ఈనెల 13న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పోలీస్ శాఖకు సంబంధించి 2,597 కేసులు పరిష్కరించినట్లు ఎస్పీ డి.జానకి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఐపీసీ కేసులు 252 ఉంటే డ్రంకన్‌డ్రైవ్, ఎంవీఐ యాక్ట్ కేసులు కలిపి 564, ఈ–పెట్టీ కేసులు 1,491, కాంప్రమైజ్ కేసులు 193, సైబర్ క్రైం 97 కేసుల్లో బాధితులకు వారి ఖాతాల్లో రూ.32,19,769 నగదు రీఫండ్ చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా పోలీస్‌శాఖ 15 రోజుల నుంచి కోర్టు సిబ్బంది కక్షిదారులను స్వయంగా కలిసి రాజీమార్గంపై అవగాహన కలిగించి లోక్ అదాలత్‌కు హాజరయ్యేవిధంగా చేశారని తెలిపారు.

2న బతుకమ్మ సంబరాలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక బాలుర జూనియర్ కళాశాల ప్రాంగణంలో వచ్చే నెల 2వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు బతుకమ్మ సంబరాలు నిర్వహించనున్నట్లు దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సత్తూర్ చంద్రకుమార్‌గౌడ్, కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. ఆదివారం స్థానిక రాంనగర్‌లోని ఆర్యసమాజ్ భవనంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. దసరా పండుగను కుటుంబ సమేతంగా హిందువులందరూ జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, కమిటీ గౌరవాధ్యక్షుడు చంద్రయ్య, సభ్యులు డా.మురళీధర్‌రావు, నాగేశ్వర్‌రెడ్డి, బురుజు సుధాకర్‌రెడ్డి, ఎ.అంజయ్య, గోపాల్ యాదవ్, మాలాద్రి, కె.లక్ష్మణ్, రాంచంద్రయ్య, మోహన్‌యాదవ్, సురేందర్‌రెడ్డి, రమేష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉత్సాహంగా నెట్‌బాల్ జట్టు ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని డీఎస్‌ఏ మైదానంలో ఆదివారం జూనియర్, సీనియర్ విభాగాల జిల్లా స్థాయి బాలబాలికల నెట్‌బాల్ ఎంపికల ట్రయల్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ రానున్న రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లకు సంబంధించి జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు. జూనియర్ విభాగంలో 48, సీనియర్ విభాగంలో 40 మంది హాజరైనట్లు తెలిపారు. కోచ్ సయ్యద్ ఆంజద్‌అలీ, సీనియర్ క్రీడాకారుడు అబ్దుల్ షరీఫ్ పాల్గొన్నారు.



ఇటువైపు చూడట్లే..



నంచర్ల నుంచి గువ్వనికుంట తండాకు వెళ్లే ప్రధాన రోడ్డు పరిస్థితి ఇది..

గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ కరువు

- పల్లెల్లో పడకేసిన అభివృద్ధి, పారిశుద్ధ్యం
- వారి మాతృ శాఖ విధుల్లోనే తలమునకలు
- సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతం
- గ్రామాల్లో స్పష్టంగా కనిపిస్తున్న పాలకులు లేని లోటు

జిల్లాలో గ్రామ పంచాయతీలు 423	ప్రత్యేకాధికారులు 150
	జూనియర్ కార్యదర్శులు 324
రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు 34	ఓపీఎస్ 33

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించింది. అయితే ప్రత్యేకాధికారులు అసలు పల్లె ముఖం చూడటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాలను విధిగా సందర్శిస్తూ పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా పర్యవేక్షించాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు. పంచాయతీ కార్యదర్శులతో ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ సమస్యలు పరిష్కరించాల్సి ఉండగా తమకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో పంచాయతీల పాలన పూర్తిగా గాడితప్పింది. దీంతో ఏదైనా సమస్య వస్తే ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు సతమతమవుతున్నారు. ఫలితంగా గ్రామాల్లో పాలకులు లేని స్పష్టంగా కనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంతకాల కోసమే..

పంచాయతీ పాలకవర్గాల గడువు 2024 జనవరి 31న ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన అనివార్యమైంది. జిల్లాలో మొత్తం 423 పంచాయతీలు ఉండగా.. వివిధ శాఖలకు సంబంధించి 150 మంది గెజిటెడ్ అధికారులను స్పెషల్ అధికారులుగా నియమించారు. ఇందులో ఎంపీడీవోలు, ఎంపీఓలు, తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, ఆర్ఐలు, ఎంఈఓలు, పీఆర్ఏఈలు, సూపరింటెండెంట్లు, ఎంపీఓలు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, వాటర్ గ్రిడ్ ఏఈలు ఉన్నారు. కొన్ని మేజర్ పంచాయతీలకు జిల్లాస్థాయి అధికారులను నియమించారు. అయితే ఇందులో ఎవరూ కూడా పంచాయతీల ముఖమే చూడటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. నెలలో కనీసం ఒకటి, రెండుసార్లు సందర్శించిన దాఖలాలు సైతం కూడా లేవు. కలెక్టర్ పర్యటించిన సందర్భంలో, అప్పుడప్పుడు సంతకాల కోసం మాత్రమే గ్రామాలకు వస్తున్నట్లు తెలుస్తోంది.

తెలియని శాఖలకు కేటాయింపు

పల్లె పాలనతో సంబంధం లేని ఇతర శాఖల అధికారులను సైతం గ్రామాలకు ప్రత్యేకాధికారులుగా నియమించారు. గ్రామ పాలనకు సంబంధం లేని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఆర్ అండ్‌బీ, జలవనరుల శాఖ, మున్సిపల్, వ్యవసాయం, వైద్యారోగ్యం, విద్య, ఉద్యాన వన, పశుసంవర్ధక తదితర శాఖల అధికారులు ఇందులో ఉన్నారు. అనుభవం లేని అధికారులు ఈ బాధ్యతలను నిర్వహించాలంటే కొంత సవాలేనని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2018లో పంచాయతీరాజ్ చట్టంలో మార్పులు చేశాక పంచాయతీల బాధ్యతలు మరింతగా పెరిగాయి. దీని ప్రకారం ప్రజలకు మెరుగైన పాలన అందాలంటే క్రమం తప్పకుండా గ్రామ పంచాయతీని సందర్శించి రోజువారీ పనులను పర్యవేక్షించాలి. అలాంటప్పుడు మాతృశాఖలో విధులు నిర్వహించడం ఎలా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

సమన్వయం చేస్తున్నాం..

పంచాయతీలను సందర్శించి సమస్యలను పరిష్కరించేలా చూడాల్సిన బాధ్యత ప్రత్యేకాధికారులపై ఉంటుంది. వారు సందర్శించడం లేదనే విషయం మా దృష్టికి రాలేదు. గ్రామ పంచాయతీలకు నియమించిన స్పెషల్ ఆఫీసర్లను సమన్వయం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చాం. – పార్థసారథి, డీపీఓ



ముఖర్లాబాద్ స్టేజీ వద్ద రెండు నెలల క్రితం తాగునీటి పైప్‌లైన్ కోసం తవ్విన గుంత

జిల్లాస్థాయి అధికారులు తమ మాతృ శాఖ విధుల్లోనే తలమునకలు అవుతున్నారు. మళ్లీ అదనంగా గ్రామ పంచాయతీల బాధ్యతలు అప్పగించడంతో ఇటు మాతృ శాఖకు, అటు గ్రామాలకు సరైన న్యాయం చేయలేకపోతున్నారనే వాదనలు ఉన్నాయి. జిల్లా అధికారులతోపాటు మండల

సంక్షేమ పథకాల అమలుతో..

స్థాయిలో ముఖ్యంగా తహసీల్దార్లు, ఎంపీడీఓలు కీలకంగా వ్యవహరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే ప్రతి అభివృద్ధి, సంక్షేమ పథకాలను మండల స్థాయి అధికారులు నిర్వహిస్తున్నారు. ఇందులో ముఖ్యంగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలు కొనసాగుతున్నాయి. ఇది కాకుండా మొన్నటి దాక రాజీవ్ యువ వికాసం హడావుడి కనిపించింది. వారి సర్వే క్షేత్రస్థాయిలో పర్యవేక్షణతోనే ఆ అధికారులకు సరిపోతుండటంతో గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది.

లక్ష ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యం



భూ పరిహారం పెంచేందుకు కృషిచేసిన మంత్రి వాకిటి శ్రీహరి, డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న భూ నిర్వాసితుల సంఘం సభ్యులు

- సీఎం రేవంత్‌రెడ్డి డ్రీమ్ ప్రాజెక్టు పేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం
- ఎకరాకు రూ. 20లక్షల పరిహారం పెంపు చారిత్రాత్మక నిర్ణయం
- విలేకర్ల సమావేశంలో రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి


నారాయణపేట: పేట–మక్తల్–కొడంగల్ ఎత్తిపోతల పథకంతో లక్ష ఎకరాలకు సాగునీరు అందించడమే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం నారాయణపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2014లో జీఓ 69 తీసుకొచ్చేందుకు కృషిచేసిన సీఎం రేవంత్‌రెడ్డి.. నేడు ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నారని అన్నారు. అందులో భాగంగా భూనిర్వాసితుల ఆకాంక్ష మేరకు రూ.20 లక్షలకు పరిహారం పెంచినట్లు వివరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మక్తల్ ఎమ్మెల్యేగా ఉన్న చిట్టెం నర్సిరెడ్డి సంగంబండ రిజర్వాయర్‌తో పాటు జాయమ్మ చెరువుతో రైతాంగానికి సాగునీరు అందించేందుకు కృషి చేశారని మంత్రి గుర్తు చేశారు. ఆ తర్వాత మారిన రాజకీయ పరిణామాలు, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ ప్రాజెక్టు మూలన పడిందన్నారు. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం.. చిట్టెం నర్సిరెడ్డి మనుమరాలు డా.చిట్టెం పర్ణికారెడ్డి నారాయణపేట ఎమ్మెల్యే కావడం.. కొడంగల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన రేవంత్‌రెడ్డి సీఎం కావడంతోనే ఈ ప్రాజెక్టు సాధ్యమవుతుందన్నారు. మక్తల్ నియోజకవర్గంలోని నేరడగాం, భూత్పూర్, సంగంబండ, అనుగొండ, జూరాల ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతుల బాధ తనకు తెలుసన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్ష మేరకు పేట–మక్తల్–కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి తీరుతామన్నారు. ఈ ప్రాంతంలో ఏళ్లుగా సాగు, తాగునీరు లేక జనం గోస పడుతున్నారన్నారు. శ్రీశైలం బ్యాక్‌వాటర్‌ను ఎల్లూరు నుంచి మహబూబ్‌నగర్, దేవరకద్ర, మన్యంకొండ మీదుగా మరికల్ వరకు తీసుకొచ్చి.. అక్కడి నుంచి మక్తల్, నారాయణపేటకు తాగునీరు అందిస్తున్నారన్నారు.

రిలే దీక్షలను విరమింపజేసిన మంత్రి

భూ పరిహారం పెంచి తమకు న్యాయం చేయాలంటూ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు వద్ద భూ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలను మంత్రి వాకిటి శ్రీహరి విరమింపజేశారు. అనంతరం సీవీఆర్ భవన్‌కు చేరుకొని మంత్రి వాకిటి శ్రీహరి, డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డికి స్వీట్లు తినిపించి సంతోషం పంచుకున్నారు.

వారోత్సవాలను జయప్రదం చేయాలి

మహబూబ్ నగర్ న్యూటౌన్: ఈ నెల 10 నుంచి 17 వరకు జరుగుతున్న తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు రాములు, సీఐటీయూ రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అశోక్ టాకీస్ చౌరస్తా నుంచి గడియారం చౌరస్తా వరకు డప్పుల ప్రదర్శనతో ర్యాలీ నిర్వహించి సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూస్వామ్య పీడనకు నైజాం నవాబు పరిపాలనకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం పుట్టుకొచ్చిందన్నారు. ఈ పోరాటంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర ఏమాత్రం లేదని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ముస్లింలపై హిందువులు విజయం సాధించినట్లు బీజేపీ దాని అనుబంధ సంస్థ ఆర్‌ఎస్‌ఎస్‌లు ప్రచారం చేసుకుంటున్నాయన్నారు. రాజకీయ లబ్ధి కోసం ఇలాంటి దిగజారుడు మాటలతో ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కురుమయ్య, టీపీఎస్‌కే జిల్లా కార్యదర్శి కురుమూర్తి, నాయకులు పద్మ, మాణిక్యం, చంద్రకాంత్, రాజ్‌కుమార్, శివలీల పాల్గొన్నారు.



ప్రజాసంఘాల ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ వద్ద డప్పు ప్రదర్శన

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: క్రీడల్లో గెలుపు, ఓటములను క్రీడాస్ఫూర్తితో సమానంగా తీసుకోవాలని జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు శాంతికుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జిల్లాస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ బాలబాలికల జట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని ఆయన మాట్లాడుతూ క్రీడలతో క్రమశిక్షణ అలవడుతుందన్నారు. కోచ్‌లు చెప్పే సలహాలు, సూచనలను పాటించాలన్నారు. జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ చాటాలని పిలుపునిచ్చారు. ఎంపిక కానివారు బాధపడవద్దని, భవిష్యత్‌లో మరిన్ని అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ ఎంపికల్లో జిల్లావ్యాప్తంగా దాదాపు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, దామోదర్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, రాములు, ముత్యం, రాంచంద్రయ్య, శ్రీహరి, ఉమామహేశ్వర్ రెడ్డి, తిరుపతయ్య, నర్సింలు, బాల్‌రాజు, శ్రీనివాసులు, గణేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధ్యక్షుడు శాంతికుమార్

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువరైతు దుర్మరణం


శివారెడ్డి (ఫైల్)

రాజోళి: విద్యుదాఘాతంతో యువరైతు మృతి చెందిన ఘటన మండలంలోని తుమ్మలపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. తుమ్మలపల్లి గ్రామానికి చెందిన సోమేశ్వర్‌రెడ్డికి ఇద్దరు కుమారులు కాగా, చిన్న కుమారుడు శివారెడ్డి(28) గ్రామంలోనే ఉంటూ వ్యవసాయం చేస్తున్నాడు. తూర్పుగార్లపాడు శివారులో వరి పంటను సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం పంటకు నీరు పెట్టేందుకు వెళ్లి మోటార్ ఆన్ చేస్తుండగా, విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. వెంటనే గమనించిన చుట్టుపక్కల రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి స్థానిక ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కర్నూల్ ఆస్పత్రికి తరలించినప్పటికీ, యువకుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అతనికి భార్య వాణి, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. గ్రామంలో యువకుడు మృతి చెందడంతో విషాదఛాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతూ మహిళ మృతి

రాజాపూర్(బాలానగర్): క్షణికావేశంలో మహిళ పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఆదివారం బాలానగర్ మండలంలో చోటుచేసుకుంది. బాలానగర్ ఎస్ఐ లెనిన్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. తిర్మలగిరి గ్రామానికి చెందిన సింగపోగు పద్మమ్మకు(45) తిర్మలగిరి గ్రామానికి చెందిన శంకరయ్యతో 25 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరి కూతురు హైదరాబాద్‌లో ఉంటోంది. కూతరు డెలివరీ కావడంతో పద్మమ్మ అక్కడికి వెళ్లింది. మూడునెలలైనా ఇంటికి రాకపోవడంతో భర్త ఆమె ఫోన్ చేసి తనకు కష్టంగా ఉంది రావాలని కోరాడు. ఈనెల 9న తిర్మలగిరికి వచ్చిన పద్మమ్మ భర్తను ఎందుకు ఫోన్‌చేసి రమ్మన్నావని గొడవ పడింది. కోపంతో తిడుతూ క్షణికావేశంలో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి 10న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆమె మృతి చెందింది. ఆమె తమ్ముడు యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిందితుల రిమాండ్

నాగర్‌కర్నూల్ క్రైం: కుటుంబకలహాలతో కన్న తల్లిని కన్నకొడుకు గొంతు నులిమి చంపిన సంఘటనలో నిందితులను ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. వివరాలిలా.. మున్సిపాలిటీ పరిధిలోని ఎండబెట్లలో అలివేల (50), ఆమె కుమారుడు శివ, కోడలు పద్మ నివసిస్తుండేవారు. అయితే, అయితే, కుమారుడు శివ జులాయిగా తిరుగుతుండడంతో తల్లి అలివేల మందలించడంతో ఆమెపై కోపం పెంచుకున్నాడు. ఎలాగైనా తల్లి అడ్డు తొలగించుకోవాలని పథకం రచించారు. శుక్రవారం అర్ధరాత్రి తల్లి అలివేల నిద్రిస్తుండగా కుమారుడు శివతోపాటు కోడలు పద్మ ఇద్దరు కలిసి గొంతునులిమి చంపినట్లు సీఐ తెలిపారు. ఆదివారం నిందితులను అరెస్టు చేసి విచారించడంతో నేరాన్ని అంగీకరించడంతో రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ.. వ్యక్తి దుర్మరణం

కల్వకుర్తి రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలోని తర్నికల్ వద్ద ఆదివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన సంఘటనలో అదే గ్రామానికి చెందిన కొప్పు సాయిలు (58) అక్కడికక్కడే మృతి చెందాడు. సాయిలు పని నిమిత్తం కల్వకుర్తికి వచ్చి తిరిగి ఆర్టీసీ బస్సులో గ్రామానికి చేరుకొని ఇంటికి వెళ్తుండగా నాగర్‌కర్నూల్ నుండి కల్వకుర్తి వైపు వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో గ్రామస్తులు, కుటుంబసభ్యులు సంఘటన స్థలంలోనే కాసేపు ఆందోళన చేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ మాధవరెడ్డి ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య బక్కమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'మహిళా అభ్యున్నతికి కృషి'



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మహిళల అభ్యున్నతికి కృషి చేస్తామని సోషల్ జస్టిస్ అండ్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ బోర్డు రాష్ట్ర అధ్యక్షుడు దోర్నాల సత్యం అన్నారు. ఆదివారం వన్‌టౌన్ సమీపంలోని సంఘం కార్యాలయంలో జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు కేంద్ర ప్రభుత్వం నుంచి స్వయం ఉపాధి పథకాలు అమలయ్యేలా చూస్తామన్నారు. వారు ఉన్నత విద్య అభ్యసించేందుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ముఖ్యంగా బోర్డు మండల కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాయగారి వేమారెడ్డి, బైరిశెట్టి శశిధర్, కావలి శ్రీధర్, తుమ్మ వీరస్వామి, తులసీదాస్ చౌదరి, పాలకొండ మల్లేష్, ప్రదీప్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటయ్య పాల్గొన్నారు.

జడ్చర్లకు ఏటీసీ సెంటర్ మంజూరు


ఏటీసీ సెంటర్‌లో శిక్షణ (ఫైల్)

- రాజాపూర్ మండలం ఈద్గాన్‌పల్లిలో ఏర్పాటుకు సన్నాహాలు
- రూ.45.15 కోట్లతో మిషనరీ, మౌలిక వసతుల కల్పన
- హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా నిర్వహణ
- పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన విద్యార్థులను తయారు చేయడమే లక్ష్యం

యువతలో సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరిచి.. ఆధునిక పరిశ్రమలు, ఫార్మా రంగాల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇచ్చి.. తక్షణ ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఏటీసీ సెంటర్లను ఏర్పాటు చేస్తుంది. తాజాగా జడ్చర్ల నియోజక వర్గానికి సైతం ఒక ఏటీసీ సెంటర్ మంజూరైంది. రూ.45.15 కోట్లతో రాజాపూర్ మండలం ఈద్గాన్‌పల్లిలో ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇన్నాళ్లు నియోజకవర్గంలోని ఫార్మా కంపెనీల్లో కిందిస్థాయి ఉద్యోగాలు మాత్రమే జిల్లాలోని వారికి అందుతున్నాయనే అపవాదు ఉండగా.. ఇక ఈ ఏటీసీ కోర్సుల్లో శిక్షణ పొందిన వారికి ప్రముఖ కంపెనీలు, స్టార్టప్‌లలో పైస్థాయి ఉద్యోగ అవకాశాలు మెండుగా రానున్నాయి.

– జడ్చర్ల టౌన్

జడ్చర్ల నియోజకవర్గంలో రూ.45.15 కోట్లతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) ఏర్పాటు కానుంది. ఈమేరకు రాజాపూర్ మండలం ఈద్గాన్‌పల్లి వద్ద సెంటర్‌కు అనువైన స్థలాన్ని గుర్తించారు. మండలంలోని పోలేపల్లిలో గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్, ఫార్మాసెజ్ ఉండటంతో ఏటీసీ సెంటర్‌కు ప్రాధాన్యత ఏర్పడింది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆధునిక సాంకేతిక విద్యలో సెంటర్ ప్రముఖంగా నిలవనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పలుచోట్ల ఏటీసీ సెంటర్లను ఏర్పాటు చేయదలిచింది. ఆయా ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్యాలు కలిగిన ఇంజినీరింగ్, ఇతర విద్యార్థులను తయారు చేసే లక్ష్యంతో ఏటీసీ సెంటర్లను మంజూరు చేసింది. ఈక్రమంలో జడ్చర్ల నియోజకవర్గం పోలేపల్లిలో ఫార్మాసెజ్ ఉండటంతో అందుకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు రాజాపూర్ మండలంలోని ఈద్గాన్‌పల్లి వద్ద ఏటీసీని ఏర్పాటు చేయదలచారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉండే కేంద్రంలో ఆధునిక సాంకేతిక విద్య ప్రముఖంగా నిలవనుంది.

వచ్చే ఏడాది అందుబాటులోకి..

ఏటీసీ సెంటర్ ద్వారా ఆధునిక ప్రయోగశాలలు అందుబాటులోకి రానున్నాయి. వాటితోపాటు గ్రంథాలయం, హాస్టల్, సాంస్కృతిక క్రీడా క్లబ్, సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం అందేలా వసతులు కల్పించబడతాయి. రూ.45.15 కోట్లతో ఏర్పాటు కానున్న ఏటీసీ కేంద్రం వచ్చే ఏడాది పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది.

ఆరు కోర్సులు.. 244 మందికి ప్రవేశాలు

ఏటీసీలో పదో తరగతి పూర్తి చేసిన వారికి ఏడాది, రెండేళ్ల కాలపరిమితితో ఉండే ఆరు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. ఒక్కో కోర్సులో 20 మంది నుంచి 44మంది వరకు ప్రవేశాలు కల్పిస్తారు. అలా ఏడాదిలో 244 మందికి అవకాశం లభిస్తుంది. కోర్సుల్లో ప్రధానంగా ఫార్మాసెజ్‌కు అవసరమయ్యే వాటికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. తద్వారా ఇన్నాళ్లు ఫార్మా కంపెనీల్లో కిందిస్థాయి ఉద్యోగాలు మాత్రమే స్థానికులకు వరిస్తున్నాయనే విమర్శలకు చెక్‌పెట్టవచ్చు. ఏటీసీ కేంద్రాల్లో శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. ప్రముఖ కంపెనీలు, స్టార్టప్‌లతో భాగస్వామ్యం ద్వారా ఇంటర్న్‌షిప్‌ద్వారా ప్లేస్‌మెంట్ సహాయాన్ని అందిస్తారు. అంతేకాక విద్య, ఉద్యోగ, పరిశోధనల్లోనూ మార్పు రానుంది. ఇప్పటికే జడ్చర్ల నియోజకవర్గంలో సెట్విన్ శిక్షణ కేంద్రం ఏర్పాటు కావడంతో నిరుద్యోగులకు ఆయా రంగాల్లో తగిన శిక్షణ లభించే ఆస్కారం ఉంది. ఇంటర్ వరకు చదివిన వారికి 'సెట్విన్' వరం కానుండగా ఆపై ఉన్నత విద్యను అభ్యసించిన వారికి ఏటీసి సెంటర్ కీలకం కానుంది. ఏటీసి సెంటర్ ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్థానికులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఏటీసీలతో ఉపాధి అవకాశాలు మెరుగు

స్థానికంగా ఉన్న నిరుద్యోగ యువతకు ఆధునిక, సాంకేతికత రంగాల్లో తగిన నైపుణ్యం కల్పించేందుకు ఏటీసి సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం .రూ.45.15 కోట్లతో రాజాపూర్ మండలంలోని ఈద్గాన్‌పల్లిలో ఏటీసీని నెలకొల్పనున్నాం. వచ్చే ఏడాది అందుబాటులోకి వచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే సెట్విన్ ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ ఇప్పించేందుకు చర్యలు తీసుకున్నాం. అలాగే ఏటీసి ద్వారా ఆధునిక, సాంకేతికతతో కూడిన విద్యను అందించటం వల్ల స్థానికంగా కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయి.

– అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో


జూరాల ప్రాజెక్టు 6 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద

- 79వేల క్యూసెక్కుల వరద
- 6 క్రస్టు గేట్ల ఎత్తివేత
- 82,813 క్యూసెక్కుల నీరు దిగువకు

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం ప్రాజెక్టుకు 1.57 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఆదివారం రాత్రి 7.30 గంటలకు ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో 79 వేల క్యూసెక్కులకు తగ్గింది. ప్రాజెక్టు 6 క్రస్టు గేట్లను ఎత్తి 41,742 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుద్పత్తి ద్వారా 40,476 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 45 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 550 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 82,813 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.531 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు ఎగువ విద్యుదుత్పత్తి కేంద్రంలో 6 యూనిట్ల ద్వారా 234 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు ఉత్పత్తి చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

13 గేట్ల ద్వారా నీటి విడుదల

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి 61,450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 13 గేట్ల ద్వారా 56,927 క్యూసెక్కులు, కేసీ కెనాల్‌కు 2,180 క్యూసెక్కులు విడుదల చేసినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

కోయిల్‌సాగర్ నీటి మట్టం

దేవరకద్ర: కోయిల్‌సాగర్ నీటి మట్టం ఆదివారం సాయంత్రం వరకు 32.3 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 32.6 అడుగులు కాగా.. మరో 0.3 అడుగుల చేరితే గేట్లను తెరిచే అవకాశం ఉంది. ఆగస్టులో భారీ వర్షాలు కురవడంతో ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండి వరుసగా చివరి రెండు వారాలు గేట్లను తెరిచి నీటిని విడుదల చేశారు.

శ్రీశైలంలో అయిదు గేట్లు ఎత్తివేత



దోమలపెంట: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో శ్రీశైలం ఆనకట్ట వద్ద ఎత్తిన ఏడు గేట్లలో ఆదివారం రెండు గేట్లను మూసి వేసి అయిదు గేట్ల ద్వారా సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. జూరాలలో స్పిల్‌వే ద్వారా 41,742, విద్యుదుత్పత్తి చేస్తూ 40,476, సుంకేసుల నుంచి 40 వేల క్యూసెక్కులు, హంద్రీ నుంచి 6,690 క్యూసెక్కులు కలిపి మొత్తం 1.29 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయానికి చేరుతోంది. ప్రాజెక్టు అయిదు గేట్లు ఒకొక్కటి పది అడుగుల మేర పైకెత్తి స్పిల్‌వే ద్వారా 1,37,390 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. మరోవైపు భూగర్భ కేంద్రంలో 16.75 మి.యూనిట్ల విద్యుదుత్పత్తి చేస్తూ 35,315, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 15.25 మి.యూనిట్ల విద్యుదుత్పత్తి చేస్తూ 30,615 మొత్తం 65,876 క్యూసెక్కుల నీళ్లను అదనంగా సాగర్‌కు విడుదలవుతున్నాయి. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 883.7 అడుగుల నీటిమట్టం వద్ద 208.2841 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇరవై నాలుగు గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడుకు 12,667 క్యూసెక్కులు, హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,429 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. స్థానికంగా 36.60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

యువత అన్ని రంగాల్లో రాణించాలి


మక్తల్‌లో హరికథ సినిమా పోస్టర్ విడుదల చేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

హరికథ సినిమా పోస్టర్ విడుదల చేసిన మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్: యువత అన్ని రంగాల్లో రాణించి మంచి పేరు తెచ్చుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. ఐరావత్ సినీ కల్చరల్ సంస్థ ఆధ్వర్యంలో మక్తల్‌కు చెందిన యువకులు చిత్రీకరించిన హరికథ సినిమా పోస్టర్‌ను ఆదివారం మంత్రి ఆవిష్కరించి మాట్లాడారు. ఈ ప్రాంతానికి చెందిన దర్శకుడు అనుదీప్‌రెడ్డితో పాటు నిర్మాతలు రంజిత్‌గౌడ్, వివేకానంద, రాఘువేందర్, కవిత తదితరులు అన్నివర్గాలకు నచ్చే కుటుంబ ప్రేమ కథా చిత్రం రూపొందించడం అభినందనీయమన్నారు. మక్తల్ నియోజకవర్గంలోనే సినిమాను చిత్రీకరించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సినీ నటులు కిరణ్, రంజిత్, సజ్జన్, అఖిల్‌రామ్, లావణ్య, కీర్తి, భాస్కర్, కృష్ణ పాల్గొన్నారు.

మక్తల్‌లోని క్రీడా ప్రాంగణంలో కంట్రీ క్లబ్ వ్యవసాయ స్థాపకుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన టీచర్స్ ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నీని మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని.. ప్రతి ఒక్కరూ క్రీడలకు కొంత సమయం కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, డీఎస్ఓ వెంకటేశ్ శెట్టి, గణేశ్‌కుమార్, భాస్కర్, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

జయప్రకాష్‌గౌడ్ అరెస్టుతో తుంకినీపూర్‌లో కలకలం

అడ్డాకుల: మూసాపేట మండలం తుంకినీపూర్‌కి చెందిన మాలెల జయప్రకాష్‌గౌడ్ ఆల్ప్రాజోలం తయారు చేస్తూ శనివారం హైదరాబాద్‌లో ఈగల్ బృందానికి పట్టుబడటం కలకలం రేపుతోంది. వీఆర్ఏగా పని చేసే జయప్రకాష్‌గౌడ్ కొన్నేళ్ల నుంచి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. విధులకు రాకపోవడంతో మూడేళ్ల కిందట వీఆర్ఏ విధుల నుంచి జయప్రకాష్‌ను రెవెన్యూ అధికారులు తప్పించారు. అయితే సికింద్రాబాద్ ఓల్డ్‌బోయిన్‌పల్లిలో మేధా హైస్కూల్ ఏర్పాటు చేసుకుని దాన్ని నడుపుతున్నాడు. ఈక్రమంలో పాఠశాలలోనే ఆల్ప్రాజోలం అనే మత్తు మందు తయారు చేస్తూ విక్రయించే క్రమంలో ఈగల్(ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) నిఘా బృందం శనివారం మాటు వేసి పట్టుకుంది. ఈ సంఘటన జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రూ.50 లక్షల విలువైన మత్తు మందు జయప్రకాష్ వద్ద పట్టుబడిన వార్త తెలిసి గ్రామస్తులు, మండల వాసులు దీనిపై ఆరా తీయడం కనిపించింది. నిందితుడు తుంకినీపూర్ గ్రామస్తుడు కావడంతో సంబంధితశాఖ అధికారులు వివరాలను సేకరిస్తున్నట్లు తెలిసింది. మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు వనపర్తి జిల్లాలోనూ ఎక్కడెక్కడ విక్రయాలు జరిపాడన్న దానిపై విచారణ చేస్తున్నట్లు సమాచారం. భూత్పూర్ కేంద్రంగా కూడా ఈ దందా సాగించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చిరుత సంచారంతో బెంబేలు


మద్దెలబండ గ్రామ సమీపంలో చిరుత సంచరించిన గుట్ట ఇదే..

వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు జంకుతున్న రైతులు

మల్దకల్: మండలంలోని మద్దెలబండ గ్రామ సమీపంలోని గుట్టల్లో చిరుత సంచారంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. గుట్టల సమీపంలో గ్రామస్తుడైన నర్సింహులుకు వ్యవసాయ పొలం ఉండగా.. అక్కడే గుడిసె ఏర్పాటు చేసుకున్నాడు. అయితే, శనివారం గుడిసె వద్ద కాపలాగా ఉన్న కుక్కలపై చిరుత దాడి చేసింది చంపింది. విషయం తెలుసుకున్న ఫారెస్టు రేంజ్ అధికారి పర్వేజ్ అహ్మద్ సంఘటన స్థలానికి చేరుకొని చిరుత జాడలని నిర్ధారణ చేయడంతో రైతుల్లో భయాందోళన మరింత ఎక్కువైంది. గుట్ట శివారులోని వ్యవసాయ పొలాల వద్ద ఉన్న పశువులను రైతులు గ్రామంలోకి తీసుకొచ్చారు. అలాగే రైతులు, కూలీలు పొలాలకు, పనులు చేసేందుకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఎక్కడి నుంచి వచ్చి చిరుత తమపై దాడి చేస్తుందోననే భయాందోళనతో గ్రామస్తులు, గుట్ట పరిసర ప్రాంతాల్లో ఉన్న రైతులు బిక్కుబిక్కుమంటున్నారు. చేతికొచ్చిన పత్తిపంటను తీయడానికి కూలీలు ముందుకు రావడం లేదు. ఇటు చిరుత భయం, అటు కూలీల భయాందోళనతో చేతికొచ్చిన పంటలను ఇంటికి తెచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఫారెస్టు అధికారులు చిరుతను బంధించి తమకు రక్షణ కల్పించాలని చుట్టుపక్కల గ్రామాల రైతులు, ప్రజలు కోరుతున్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడల సందడి


మిడ్జిల్‌లో జరిగిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు (ఫైల్)

- మండల స్థాయిలో కొనసాగుతున్న పోటీలు
- త్వరలో జిల్లా స్థాయి, ఆపై ఉమ్మడి జిల్లా ఎంపికలు
- జిల్లా నుంచి అండర్–14, అండర్–17 విభాగాల్లో క్రీడా టోర్నీలకు ప్రతిపాదనలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడల సందడి నెలకొంది. పాఠశాల స్థాయిలో విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రతి ఏడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తారు. పాఠశాల, కళాశాలల్లో అండర్–14, అండర్–17 బాల, బాలికలకు వేర్వేరుగా మండల స్థాయి మొదలు కొని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు.

విద్యార్థుల నైపుణ్యానికి వేదిక

పాఠశాల స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ఒక వేదికగా ఉపయోగపడుతుంది. గతంలో జిల్లాకు చెందిన ఎందరో క్రీడాకారులు స్కూల్ గేమ్స్ ద్వారానే ప్రతిభ చాటి వెలుగులోకి వచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందింది. ఆరేళ్ల నుంచి వరుసగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా టోర్నీలను విజయవంతంగా నిర్వహించి అందరి మన్ననలు పొందారు.

జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి..

ఈ ఏడాది జిల్లాలో పలు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే దానికి సంబంధించిన ప్రతిపాదనలు పంపారు. రాష్ట్రస్థాయి అండర్–17 విభాగం బాల, బాలికలకు వాలీబాల్, అండర్–14 విభాగం బాల, బాలికల ఖోఖో, అండర్–17 బాల, బాలికల ఫుట్‌బాల్, అండర్–17 బాలుర విభాగం క్రికెట్ టోర్నీల కోసం ప్రతిపాదనలు చేశారు.

మండల స్థాయిలో ఎస్‌జీఎఫ్ క్రీడలు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు సంబంధించి మండల స్థాయిలో క్రీడలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో టోర్నీ కమ్ ఎంపికలు జరుగుతున్నాయి. ఇక్కడ ప్రతిభ కనబరిచే క్రీడాకారులు జిల్లాస్థాయి టోర్నీ కమ్ సెలక్షన్స్‌లో పాల్గొంటారు. మండలస్థాయిలో క్రీడా పోటీలు పూర్తయిన అనంతరం త్వరలో జిల్లాస్థాయిలో, ఆపై ఉమ్మడి జిల్లాస్థాయిలో జరగనున్నాయి.

జిల్లాలో జాతీయస్థాయిలో క్రికెట్ టోర్నీలు

జిల్లాలో 69వ నేషనల్ స్కూల్ గేమ్స్ క్రికెట్ అండర్–17 బాలుర, బాలికల చాంపియన్‌షిప్‌లు నిర్వహించనున్నారు. ఈ ఏడాది జూన్‌లో 2025–26 జాతీయస్థాయి టోర్నీలకు సంబంధించిన క్యాలెండర్‌ను విడుదల చేయగా.. మహబూబ్‌నగర్‌కు అండర్–17 విభాగం బాల, బాలికల క్రికెట్ టోర్నీలు కేటాయించారు. అండర్–17 విభాగం బాలుర క్రికెట్ టోర్నమెంట్‌ను అక్టోబర్‌లో, బాలికల క్రికెట్ పోటీలు జనవరిలో నిర్వహించడానికి జిల్లా ఎస్‌జీఎఫ్ వారు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

విజయవంతంగా నిర్వహిస్తాం



ఈ ఏడాది అండర్–14, అండర్–17 విభాగాలకు సంబంధించి రాష్ట్రస్థాయి క్రీడా టోర్నీల కోసం ప్రతిపాదనలు పంపాం. జిల్లాకు ఏ టోర్నీలు కేటాయించినా వాటిని విజయవంతంగా నిర్వహిస్తాం. మండల స్థాయి క్రీడా పోటీల అనంతరం జిల్లా, ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపికలు పకడ్బందీగా నిర్వహిస్తాం.

– డాక్టర్ శారదాబాయి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి, మహబూబ్‌నగర్